APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 253 | ఎడిటర్ : ఎం. రమేష్ | గురువారం, ఆగస్టు 29, 2024 | పేజీలు : 04 | వెల రూ. 5.00/-

# రివర్స్ టెండరింగ్ విధానం రద్దు





పాతపద్దతితలోనే టెండర్ల విధానం
ఆబ్కారీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు గ్రీన్ సిగ్నల్
జగన్ ఫోటోలున్న పాస్ పుస్తకాలు రద్దు
మున్సిపల్ శాఖలో 269 సూపర్ న్యూమరీ పోస్టుల భర్తీ
2,771 కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు ఆమోదం
ఎపి కేబినేట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు

**అమరావతి,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని మంత్రివర్గం రద్దు చేసింది. పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఆబ్కారీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రద్దుకు ఆమోదం తెలిపింది. పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో తొలగింపు, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అంగీకారం తెలిపింది. పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ పనుల్లో ప్రస్తుత గుత్తేదారు సంస్థనే కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివాదాల్లోని భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేతకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్ సర్కార్


- మిగతా 2లో..

# నేరుగా ఇంటికి చేరుకున్న కవిత

**తల్లిని ఆలింగనం చేసుకుని కన్నీటి పర్యంతం**
**ఓదార్చిన బంధువులు.. సన్నిహితులు**
**అన్నకెటిఆర్‌కు రాఖీ కట్టిన కవిత**
**ఫామ్‌హౌజ్‌లో తండ్రి కెసిఆర్‌ను కలవనున్న కవిత**

**హైదరాబాద్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తీహార్ జైలు నుంచి విడుదలై హైదరాబాద్ చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఇంటి వద్ద కవితకు దిష్టి తీసి అభిమానులు ఇంట్లోకి ఆహ్వానం పలికారు. ఇక బంధువులు, కుటుంబ సభ్యులు పూల వర్షం కురిపించి కవితకు ఘన స్వాగతం పలికారు. ఇంట్లోకి వెళ్లిన తర్వాత నేరుగా పూజ గదికి వెళ్లి దేవుళ్లకు దండం పెట్టుకున్నారు. కవితను కలిసిన వెంటనే తల్లి శోభ, ఇతర కుటుంబ సభ్యులు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. తల్లి శోభమ్మ పాదాలకు నమస్కరించి కవిత ఆశీర్వాదం తీసుకున్నారు. కూతురిని ఆప్యాయంగా హత్తుకున్నాక తల్లి శోభ కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిని పట్టుకుని కవిత కూడా ఏడ్చారు. కుటుంబ సభ్యులు ఓదార్చారు. ఇక తన సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆమె రాఖీ కట్టారు. ఢిల్లీ నుంచి శంషాబాద్‌కు చేరుకున్న కవితకు గులాబీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా గులాబీ నేతలు, కార్యకర్తలు కవితపై పూలవర్షం కురిపించగా.. పార్టీ శ్రేణులకు కవిత అభివాదం చేశారు. పడికిలి బిగించి జై తెలంగాణ అంటూ నినదించారు. కార్యకర్తల జై తెలంగాణ నినాదాలతో ఎయిర్‌పోర్ట్ దద్దరిల్లింది. ఐదునెలల తర్వాత కవిత హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, భర్త అనిల్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు ఉన్నారు. కవిత ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీగా బంజారాహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. గురువారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ చేరుకొని తండ్రి, కేసీఆర్‌ను కలుసుకోనున్నారు.





## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా నిధులు

**పోలవరం...ఇండస్ట్రియల్ పార్కులకు కేటాయింపులు**
**కేబినేట్ నిర్ణయాలతో ఎపి పురోభివృద్ధికి అడుగులు**
**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

2




## వరంగల్‌లో గవర్నర్ పర్యటన

5

**ములుగు జిల్లాలో గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటన**

# రీజినల్ రింగ్ రోడ్డుపై సిఎం సమీక్ష

**హైదరాబాద్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

జూబ్లీహిల్స్ నివాసంలో రీజినల్ రింగ్ రోడ్ (దక్షిణ భాగం) అలైన్‌మెంట్ పై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. త్వరగా భూసేకరణ చేయడంతో పాటు, సర్వీస్ రోడ్లనిర్మాణం తదితర అంశాలను సిఎం చర్చించారు. దీనిని ప్రతిష్టాత్మకంగా సిఎం భావిస్తున్నారు. త్వరగా భూసేకరణ ద్వారా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం

**ఏర్పాటుకు సంబంధించి భూమిపూజ**
**డిసెంబర్ 9నాటికి విగ్రహావిష్కరణ**
**పూజలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు**





**హైదరాబాద్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ సచివాలయంలో డిసెంబర్ 9 నాటికి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే స్థలపరిశీలన చేసిన చోట విగ్రహం ఏర్పాటుకు పూనుకుంది. ఈ మేరకు బుధవారం భూమి పూజ నిర్వహించింది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పక్రియ చేపట్టారు. వేదమంత్రాలుగా సాక్షింగా 11 గంటలకు రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులు పలుమార్లు చర్చించి సచివాలయంలో పోర్టికోకు ఎదురుగా విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించారు. మెయిన్ గేట్ నుంచి భవనం లోపలకు వెళ్ళే క్రమంలో అందరికీ కనిపించేలా దాన్ని రూపొందిస్తున్నారు. అక్కడే ఇవాళ భూమి పూజ జరిగింది. దీన్ని శరవేగంగా డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలి ప్రభుత్వం సంకల్పించింది. 2009లో డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ ఇస్తున్నట్టు ప్రకటించారు. అందుకే ఆ తేదీన విగ్రహావిష్కరణ చేయాలని నిర్ణయించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ఆర్టిస్టులు, తెలంగాణకు చెందిన కళాకారులు రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాలను పరిశీలించిన తర్వాత ఫైనల్ విగ్రహాన్ని ఖరారు చేయనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే ఉంటుందంటున్నారు. విగ్రహం తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా ఉంటుందని చెబుతున్నారు. తెలంగాణ ప్రజల దయాగుణం, త్యాగనిరత, మహిళల రూపం అన్నీ కలిసేలా రూపొందించనున్నారు. దసరా వరకు మంచిరోజులు లేవని వేదపండితులు చెప్పడంతోనే ఇప్పుడు హడావుడిగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఉండదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారన్నారు. సోనియమ్మ మాట ఇస్తే అది శిలాశాసనమని తెలంగామ రాష్ట్ర ఏర్పాటు నిరూపిచిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని గుర్తు చేశారు. పదేళ్లు పరిపాలన చేసిన వారు తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని విమర్శించారు. నేనే తెలంగాణ.. తెలంగాణనే నేను అనే విధంగా గత పాలకులు వ్యవహరించారని ధ్వజమెత్తారు. ప్రజాప్రభుత్వం అలాంటి విధానాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. సచివాలయం తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు గుండెకాయలాంటిదని అందుకే అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గత పాలకులు పదేళ్లు సచివాలయంలోకి ప్రజలకు ప్రవేశం కల్పించలేదని తెలిపారు. అదే కాకుండా సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు వారికి మనసు రాలేదని ఆరోపించారు. ట్యాంక్ బండ్ నలువైపులా ఎంతో మంది ప్రముఖుల విగ్రహాలు ఉన్నాయని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్ గాంధీ విగ్రహం లేకపోవడం లోటుగా కనిపించిందని అభిప్రాయపడ్డారు. మేధావుల సూచన మేరకే సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీన్ని వివాదం చేసేందుకే తెలంగాణ తల్లి విగ్రహంతో ముడి పెట్టారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉండి వాళ్లు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభిస్తామని ఇప్పటికే రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విగ్రహం ఏర్పాటుకు ఇవాళ రేవంత్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు ఇవాళ శుభ దినమని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి తెలంగాణ తల్లి తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2004 కరీంనగర్‌లో తమ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ మాట ఇచ్చారని.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన తరువాత అనేక రకాలుగా వెనుక బడ్డారన్నారు. తెలంగాణ తల్లిని వెనక్కి నెట్టి వారే సర్వం అన్నట్లు గత పాలకులు వ్యవహరించారన్నారు. ముళ్ళ కంచె ఏర్పాటు చేసుకొని రాజ భోగం అనుభవించారన్నారు. అది ఒకప్పుడు ఘడీల భవనమని.. ఇప్పుడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవనమని పేర్కొన్నారు. పదేళ్లు ముఖ్యమంత్రి , మంత్రులు ఎవరూ అందుబాటులో లేరని.. అసలు సచివాలయంలోకి సామాన్యులకు ఎంట్రీయే లేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి సచివాలయం నిర్మించిన వాళ్లకు కోటి రూపాయలు పెట్టి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టలేకపాయారని రేవంత్ విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ఎదురుగా పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సచివాలయం ఎదురుగా ఖాళీ స్థలంలో కొంతమంది తమ కోసం ఆపారన్నారు. తెలంగాణ తల్లి అంటే దర్పం, పోరాట పటిమకు స్ఫూర్తి అని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ తల్లి దొరల కోటలో బందీ కావొద్దన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా నిధులు

**పోలవరం...ఇండస్ట్రియల్ పార్కులకు కేటాయింపులు**
**కేబినేట్ నిర్ణయాలతో ఎపి పురోభివృద్ధికి అడుగులు**
**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**న్యూఢిల్లీ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాని కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రూ. 12 వేల కోట్లకు ఆమోదం తెలుపడంతో పాటు.. రాష్ట్రంలో 2 ఇండిస్ట్రియల్ స్మార్ట్ సిటీస్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం సిద్ధమైంది. బుధవారం కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాకు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ. 12 వేల కోట్లకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. అలాగే పోలవరం ప్రాజెక్టును గతంలో నిర్మించిన నిర్మాణ సంస్థలకే పనులు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. జగన్ నిర్ణయాలతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వెనక్కి వెళ్లిందని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పోలవరంపై దృష్టి పెట్టారన్నారు. ఆయన నాయకత్వంలో ఇవన్నీ సాధ్యమవుతున్నాయని చెప్పారు. ఏపీకి నిధులు కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

పోలవరం ఒక్కటే కాదు.. మరికొన్ని కేటాయింపులు కూడా చేసినట్లు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బుధవారం జరిగిన కేబినెట్‌లో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. పారిశ్రామిక కారిడార్లు దేశ వ్యాప్తంగా 12 ఏర్పాటు చేస్తే.. అందులో 2 ఏపీలోనే ఉన్నాయన్నారు. బ్జడెట్‌లో చెప్పిన కొద్దిరోజుల్లోనే వాస్తవ రూపంలోకి తీసుకొచ్చామన్నారు. హైదరాబాద్ – బెంగళూరు కారిడార్, విశాఖ – చెన్నై కారిడార్‌లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీస్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఓర్వకల్లులో ఒకటి, కొప్పర్తిలో ఒకటి ఏర్పాటు అవుతున్నాయని చెప్పారు. ఒక్క ఓర్వకల్లు నోడ్‌లో రూ. 12 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. కొప్పర్తి నోడ్ కి రూ. 2,131 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పిన కేంద్ర మంత్రి.. ఇక్కడ రూ. 8 వేల కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయన్నారు. తద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కలగనుందన్నారు. డబుల్ ఇంజన్ గ్రోత్ ఓరియెంటెడ్ ప్రభుత్వం కారణంగా ఇది సాధ్యమైందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గత కొన్నేళ్లలో ఏపీ అనేక రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. అందుకే ప్రజలు తిరుగులేని మెజారిటీతో చంద్రబాబు–మోడీ–పవన్ కళ్యాణ్ లను ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు పెరిగిన అంచనా వ్యయం రూ 12,000 కోట్ల మేర నిధులకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని.. వర్షాకాలం ముగిసిన వెంటనే పనులు మొదలుపెట్టాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని కేంద్ర మంత్రి చెప్పారు. పెండింగ్ అంశాలను కూడా త్వరగా పరిష్కరించే బాధ్యత తాము తీసుకుని ముందుకు నడిపిస్తామన్నారు. కొత్త డయాఫ్రమ్ వాల్ సహా పెరిగిన అంచనా వ్యయానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇది ఏపీకి మేలు చేస్తుందన్నారు.

# తెలంగాణకు అక్కరలేని విగ్రహాలను తొలగిస్తాం

**మరోమారు హెచ్చరించిన కెటిఆర్**

**హైదరాబాద్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. సోనియాగాంధీని దెయ్యం, పిశాచి, బలి దేవత అని అన్న నువ్వా రాజీవ్ గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది అని విమర్శించారు. దొడ్డి దారిన పీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద నువ్వు ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలు రంగు అందరికీ తెలుసని అన్నారు. నీ ఆలోచనల్లో కుసంస్కారం.. నీ మాటలు అష్ట వికారం అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు ఏంటని అడిగితే కారుకూతలు కూస్తావా అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే అని విరుచుకుపడ్డారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటది అని ఎద్దేవా చేశారు. తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నాం.. రాసి పెట్టుకో అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాగా, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపైనా కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తమ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

# కోల్‌కతా హత్యాచార ఘటన విచారకరం

**నాగరిక సమాజం ఇలాంటివి అంగీకరించదు**
**తొలిసారి స్పందిస్తూ తీవ్ర విచారం ప్రకటించిన రాష్ట్రపతి**

**న్యూఢిల్లీ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్) :**

కోల్‌కతాలో జరిగిన సంఘటనపై రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేస్తూ, మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలను ఏ నాగరిక సమాజంలోనూ అనుమతించలేమని రాష్ట్రపతి అన్నారు. సమాజం కూడా నిజాయితీగా, న్యాయంగా ఉండేందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలి. 2012లో ఢిల్లీ నిర్భయ కేసు మరువక ముందే.. దేశంలో లేక్కలేనన్ని అఘాయిత్యాలు జరుగుతుండటం బాధకరం అన్నారు. కోలకతా లో జరిగిన మరో అత్యంత దారుణమైన, హేయమైన చర్య అని రాష్ట్రపతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా స్పందించారు. తీవ్ర విచారం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ఈ ఘటన ఎంతో వేదనకు గురిచేసిందని, విషయం తెలిసి భయపడ్డానని ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. భారతీయ కూతుళ్లపై ఇలాంటి ఆకృత్యాలను ఏ నాగరిక సమాజం సహించదన్నారు. ఇప్పటికైనా ఈ దుర్మార్గాలను ఆపాలని ఆమె పిలుపునిచ్చారు. కొందరు వ్యక్తులు స్త్రీలను తక్కువగా, తక్కువ శక్తిమంతులుగా, తక్కువ సామర్థ్యం ఉన్నవారుగా, తక్కువ తెలివిగలవారుగా చూస్తారు. కూతుళ్లు, అక్కాచె÷-లలెళ్లపై ఇలాంటి అఘాయిత్యాలను ఏ నాగరిక సమాజం అనుమతించదు. ఇలాంటి అభిప్రాయాలు ఉన్నవారు స్త్రీలను ఒక వస్తువుగా చూస్తారు. భయం నుండి విముక్తి పొందేందుకు వచ్చే అడ్డంకులను తొలగించడం మన ఆడపిల్లల కర్తవ్యం అని రాష్ట్రపతి తెలిపారు. నిర్భయ తర్వాత గత 12 ఏళ్లలో జరిగిన లెక్కలేనన్ని అత్యాచారాలను సమాజం మరచిపోయిందని, ఈ సామూహిక స్మృతి సరికాదని ఆమె అన్నారు. చరిత్రను ఎదుర్కోవడానికి భయపడే సమాజాలు సామూహిక విస్మృతిని ఆశ్రయిస్తాయి. భారతదేశం చరిత్రను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు రాష్ట్రపతి. సమాజం కొన్ని కఠినమైన ప్రశ్నలు వేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కూతుళ్లు, అక్కాచె÷-లలెళ్లపై ఇలాంటి అఘాయిత్యాల నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో నైట్ డ్యూటీ చేస్తున్న జూనియర్ డాక్టర్‌పై ఆగస్టు 9న అత్యాచారం జరిగింది. ఆ తర్వాత జూనియర్ డాక్టర్ దారుణ హత్యకు గురయ్యారు. వైద్యురాలి ముఖం, శరీరంపై గాయాలు కనిపించాయి. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే పోలీసుల అలసత్వం కారణంగా కలకత్తా హైకోర్టు ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. ఈ ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు సమ్మెకు పిలుపు నిచ్చారు. వైద్యుల భద్రతకు సంబంధించి చట్టం చేయాలనే డిమాండ్ చేస్తున్నారు. కోల్‌కతా కేసుకు వ్యతిరేకంగా బెంగాల్‌తోపాటు దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి.

# రివర్స్ టెండరింగ్ విధానం రద్దు

మొదటి పేజీ తరువాయి

నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్ర మున్సిపల్ శాఖలో 269 సూపర్ న్యూమరీ పోస్టుల భర్తీకి ఏపీ క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే పౌరసరఫరాల శాఖకు సంబంధించి 2,771 కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుధవారం ఉదయం 11గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటైన క్యాబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ క్యాబినెట్ సమావేశంలో మరికొన్ని కీలక అంశాలపై చర్చ జరిగింది. గత ప్రభుత్వం తెచ్చిన రివర్స్ టెండరింగ్ విధానం రద్దు చేస్తూ ఏపీ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీన్ని ఒక నిరుపయోగమైన విధానంగా మంత్రులు వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విధానం సరికాదని, అందుకే రద్దు చేయాలంటూ తీర్మానించారు. అలాగే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహణపై క్యాబినెట్‌లో చర్చ సాగింది. 2014లో చివరిసారిగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటోలతో కూడిన పాసు పుస్తకాల స్థానంలో కొత్తగా 21లక్షల పుస్తకాలను రైతులకు ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే గత ప్రభుత్వం 77లక్షల సర్వేరాళ్లపై ముద్రించిన ఫొటోలను చెరిపి వాటిని వినియోగించుకునే విషయం పైనా చర్చసాగింది. కొత్తగా 2,774రేషన్ షాపుల ఏర్పాటుపై క్యాబినెట్ ముందుకు ప్రతిపాదనలు వచ్చాయి. విజన్ 2047 రూపకల్పనపై పెద్దఎత్తున చర్చ జరిగింది. ఏపీలో కొత్త మద్యం పాలసీ తెచ్చే అంశంపైనా క్యాబినెట్ ముందుకు ప్రతిపాదనలు వచ్చాయి. ఉచిత ఇసుక విధానాన్ని సులభతరం చేసేందుకు తీసుకునే నిర్ణయాలపైనా క్యాబినెట్‌లో మంత్రులు, ముఖ్యమంత్రి చర్చించారు.

# పోలవరానికి కేంద్రం సుముఖం

**నిధుల కేటాయింపు..త్వరగా పూర్తికి సహకారం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్) :**

గతకొంతకాలంగా అంటీముట్టనట్లుగా ఉంటూ వచ్చిన కేంద్రం.. పోలవరం ప్రాజెక్టు పూర్తి నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు పూర్తికి అవసరమైన మొత్తం నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. పెండింగ్ పనులు సహా పూర్తిచేసేందుకు అవసరమైన నిధులన్నీ ఇచ్చేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది. పోలవరం అంశంపై ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు పలు దఫాలుగా చర్చలు జరిపారు. దిల్లీ వెళ్లి వారిని కలిశారు. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా పోలవరం పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కేటాయింపునకు అంగీకారం తెలిపినట్లు సమాచారం.గత ఐదేళ్లుగా సక్రమంగా నిధులు విడుదల కాకపోవడంతో, ఇచ్చిన నిధులు పక్కదారి పట్టాయి. ఈ క్రమంలోఇక పోలవరం పనులు వేగం పుంజుకోనున్నాయి.

# నేటినుంచి జాతీయ ఉద్యాన ప్రదర్శన

**హైదరాబాద్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ రాష్ట్రం 16వ జాతీయ వ్యవసాయ ఉద్యాన ప్రదర్శనకు సిద్ధమైంది.నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా గురువారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ ఉద్యాన శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేయనున్నారు. సెప్టెంబర్ 2వరకూ మొత్తం ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు దేశం నలుమూలల నుంచి వచ్చిన నర్సరీల నిర్వాహకులు , సేంద్రీయ ఎరువులు , ఇతర పరికరాల సంస్థల ప్రతినిధులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీల ప్రతినిధులు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు.వందలాది రకాల పండ్ల మొక్కలు, పూల మొక్కలు, ఔషధ మొక్కలు, అలంకరణ మొక్కలు, మరగుజ్జు వృక్షాలు, తీగ జాతి మొక్కలు, వాటికి సంబంధించిన విత్తనాలు, దుంప మొక్కలు ఈ ప్రదర్శనలో కొలువుదీరుతున్నాయి. చూపరులను కట్టిపడేసేలా ఉన్న వివిధ రకాల అరుదైన జాతులకు చెందిన మొక్కలు ఈ సారి ప్రదర్శనకు హైలెట్‌గా మారనున్నాయని ప్రదర్శన నిర్వాహకులు ఖలీద్ ఆహ్మద్ జమీర్ వెల్లడించారు. ఈ ప్రదర్శనలో మొత్తం 140కి పైగా స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. ప్రతిరోజు ఉదయం తొమ్మది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ ప్రదర్శన ఉండనుంది.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
గురువారం । ఆగస్టు । 29 । 2024


# టీడీపీ నేతలు సంతోషంగా ఉన్నారా?

**డోన్, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

మనకూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. ప్రభుత్వం వస్తే, అది చేసుకోవచ్చు, ఇది చేసుకోవచ్చు అంటూ ముఖ్యంగా టీడీపీ నేతలు ఎన్నో కలలు కన్నారు. ప్రభుత్వం వచ్చినప్పటికీ, ఇంతకాలం తాము కన్న కలలు నెరవేర్చుకునే పరిస్థితి లేదని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఏ ప్రభుత్వంలో అయినా ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలకు దగ్గరగా ఉన్న ఐదారుగురు మాత్రమే ఆర్థికంగా బాగుపడతారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఇదే జరిగింది. ఇప్పుడు ఏం జరుగుతుందో చూడాలి. ఒకటి మాత్రం నిజం. టీడీపీ నేతల్లో చిన్న అసంతృప్తి. ప్రభుత్వం వచ్చి రెండు నెలలైనా నామినేటెడ్ పోస్టులపై అడుగులు ముందుకు పడలేదని. ఒక్కసారిగా అన్ని రకాల నామినేటెడ్ పోస్టులు కాకపోయినా, కొన్నైనా భర్తీ చేస్తే బాగుంటుందనే అభిప్రాయం టీడీపీ నేతల్లో వుంది. ఇప్పుడు ప్రతి విషయంలోనూ జనసేన, బీజేపీ నేతలకు అధికారంలో భాగం ఇవ్వాల్సి రావడం టీడీపీ నేతలకు కష్టంగా వుంది. ఆదాయ వనరులపై టీడీపీ నేతలు దృష్టి సారించారు. అయితే ప్రభుత్వ ఖజానా ఖాళీగా వుండడంతో ఏం చేసుకోవాలన్నా దిక్కుతోచని స్థితి. ఇలాగైతే గట్టెక్కడం ఎలా? అనే ప్రశ్న టీడీపీ నేతల ఎదుట నిటారుగా నిలిచింది. ప్రభుత్వం వచ్చిందన్న ఆనందం తప్ప, మరే సుఖం లేదని టీడీపీ నేతలు అంటున్నారు. ఏమైనా వుంటే చూడండబ్బా అని వైసీపీ నేతల్ని టీడీపీ నేతలు అడుగుతున్న పరిస్థితి. మరికొన్ని చోట్ల వైసీపీ నేతల వ్యాపారాల్ని టీడీపీ నేతలు లాక్కున్నారు. ఇదో విచిత్రమైన పరిస్థితి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పది రూపాయలు సంపాదించుకోవాలన్న ఆత్రుత వాళ్లలో కనిపిస్తోంది. చట్టబద్ధంగా ఈ ప్రభుత్వంలో ఏమీ చేసుకోలేమన్న భావన వాళ్లలో కనిపిస్తోంది. ఇలా ఎన్నాళ్లో చూడాలి మరి!

**డబ్బు లేదు తర్వాత చూద్దాం!**

కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. దీంతో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పనుల కోసం సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర ప్రభుత్వ పెద్దల వద్దకు వెళుతున్నారు. మరీ ముఖ్యంగా ఈ దఫా పెద్ద సంఖ్యలో కొత్త ఎమ్మెల్యేలున్నారు. దీంతో ఉత్సాహంతో అభివృద్ధి పనుల విషయమై ప్రతిపాదనల్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళుతున్నారు. సీఎం సమాధానంతో నిరుత్సాహంగా వెనుదిరుగుతున్నారు. అసంపూర్తిగా మిగిలిన పనుల్ని పూర్తి చేస్తే రైతాంగానికి సాగునీళ్లు అందిస్తే అనగా నియోజకవర్గం లో ఉన్న చెరువు లకు నీరు అందిస్తే రైతులు చాలా సంతోషం పడతారు. ఒక్క అమరావతి నిర్మాణానికి తప్ప, ప్రభుత్వం వద్ద డబ్బే లేదనే సమాధానం సీఎం నుంచి వస్తోంది. దీంతో ఏ ఒక్క అభివృద్ధి పని ముందడుగు పడడం లేదు. హామీలు మాత్రం చాలా ఇచ్చారు. వీటన్నింటిని ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితి ఎదురవుతోంది. ఇటు ఉన్నతాధికారులు, అటు ప్రభుత్వ పెద్దల నుంచి చూద్దాం. చేద్దాం అనే సమాధానం మాత్రమే వస్తోంది. ఒకసారి అడిగిన తర్వాత, మళ్లీ ఆరు నెలల వరకూ అటు వైపు తొంగి చూసే పరిస్థితి ఉండదని ఎమ్మెల్యేలే చెబుతున్నారు. దీంతో గత ప్రభుత్వంలో మాదిరిగానే, కొత్త ప్రభుత్వంలో కూడా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదనే చర్చకు తెరలేచింది.

## ఏటీఎం మిషన్ల మరియు బ్యాంకుల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీని నియమించాలి : సీఐ వంశీధర్

**సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలి : ఎస్సై చిన్న పిరయ్య**




**శిరివెళ్ల, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

శిరివెళ్ల మండల పరిధిలోని బ్యాంక్ మేనేజర్లతో బుధవారం శిరివెళ్ల పోలీస్ స్టేషన్ లో సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్న పీరయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ, బ్యాంకులకు సంబంధించిన ఆయా ఏటీఎం మిషన్ల వద్ద బ్యాంకు అధికారులు తప్పనిసరిగా సెక్యూరిటీని నియమించుకోవాలన్నారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా వర్కింగ్ లో ఉండేలా చూసుకోవాలన్నారు. రాబరీ జరిగిన సమయాలలో దొంగలను పట్టుకోవడానికి వీలుంటుందన్నారు. దొంగలు ఎంత తెలివిగా దొంగతనాలు చేసిన పోలీసుల నుండి తప్పించుకోలేరన్నారు. అలాగే సైబర్ నేరాలపై ఖాతాదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, ఈ మధ్య కాలంలో ఆన్ లైన్ మోసాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయన్నారు. తెలియని లింక్ లను ఖాతాదారులు క్లిక్ చేసి ఖాతా లోని నగదును పోగొట్టుకుంటున్నారన్నారు. స్మార్ట్ ఫోన్ వాడే ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని వారికి ఓటిపీ లు చెప్పవద్దన్నారు. మీ వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ షేర్ చేసుకోరాదని సూచించారు. బ్యాంకర్లు ఖాతాదారులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనకి చేసిన ఎమ్మెల్యే విరుపాక్షి



**హొళగుంద/ఆలూరు, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

విద్యార్థులతో ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ.. బాగా చదువుకొని ఉన్న స్థాయికి వెళ్లాలని అన్నారు. అదే విధంగా ఈ కళాశాలకు చెందిన జె.మేఘన అనే అమ్మాయి సీఈసీ మొదటి సంవత్సరంలో జిల్లా టాపర్ గా నిలిచినందుకు ఎమ్మెల్యే తనను అభినందించి పదివేల రూపాయలు బహుమతిగా అందించడం జరిగింది. ఈ అమ్మాయి లాగే ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని వచ్చే సంవత్సరం రాష్ట్రంలో మొదటి స్థానం సాధించి హొళగుంద మండలానికి ఆలూరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకొని రావాలని తెలిపారు. ఈ విధంగా సాధించి మంచిగా చదువుకునే వారికి నేను ఎల్లప్పుడు మంచి ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొని రావాలని ఎల్లప్పుడు నేను మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

## ప్రజలకు భరోసా కల్పించేలా పోలీసులు విధులు నిర్వహించాలి : ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

**ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్ఐ చిన్న పీరయ్య**



**శిరివెళ్ల, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియని ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శిరివెళ్ల సబ్ ఇన్ స్పెక్టర్ చిన్న పీరయ్య ఎమ్మెల్యే నివాసంలో పూల మొక్కలు అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ నూతన ఎస్ఐ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ, తమ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రజలకు భరోసా కల్పించేలా పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. గత ప్రభుత్వంలో డ్రగ్స్ బారిన పడి చాలా మంది యువత తమ జీవితాలను నాశనం చేసుకున్నారని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.

## బాల నేత్ర బందు కార్యక్రమం విజయవంతం: తెలగంశెట్టి

**18 సంవత్సరాలలోపు విద్యార్థులకు కంటి పరీక్షలు**

**యు.కొత్తపల్లి, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**






పొన్నాడ పంచాయితీ కోన పాపపేట గ్రామం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు. బాల నేత్ర బందు కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖామంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వచ్చేనెల రెండో తారీకు సందర్భంగా బుధవారం నాడు పిఠాపురం నియోజవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి హాస్పిటల్ వారి సౌజన్య తో పొన్నాడ పంచాయతీ కోన పాప పేట గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థి విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా తెలగంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కిరణ్ కంటి హాస్పిటల్ వారి సేవలో అద్భుతమని ఉచితంగా కొన్ని వేలమందికి కంటి పరీక్ష లు నిర్వహించి ఆపరేషన్లు కళ్ళజోళ్ళు ఇచ్చి పేదలను ఆదుకుంటున్నారని . ఇటువంటి సేవా కార్యక్రమం చేస్తున్నందుకు వారికి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. అదేవిధంగా హైస్కూల్లో మొత్తం 697 పంది విద్యార్థి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 30 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు ఇస్తారని వెంకటేశ్వర రావు తెలిపారు .మన ప్రియతమ నాయకులు పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఈరోజు నుండి ఆయన పేరు మీద పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో బండి దావీదు ,పల్లేటి బాపన దొర, వాడ్రా ధన బాబు ,సీతయ్య కాపు, పల్లెటి దేవుడు కారే మహేష్, కారే బాబ్జి ,రాచపల్లి సింహాద్రి, కారే రాజు, సుబ్రమణ్యం కిరణ్ కంటి యాజమాన్యం ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

**రూ. 41240 నగదు స్వాధీనం**
**6, సెల్ ఫోన్లు స్వాధీనం.. 8 బైకులు సీజ్**
**పారిపోయిన 5 మంది వ్యక్తులు**

**నంద్యాల, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

రుద్రవరం మండలంలోని ఆలమూరు సమీపంలో పేకాట ఆడుతున్న 4 వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై యువి వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలమూరు గ్రామం వెలపల గల మొక్కజొన్న తోట వద్ద అందర్-బహార్ ఆడుతున్నారని సమాచారం రావడంతో ఇబ్బందితో కలిసి దాడులు నిర్వహించమన్నారు. ఇందులో భాగంగా 4 గురును అరెస్టు చేసి వారి వద్ద 41240/- నగదు ఆరు సెల్ ఫోన్లు మరియు ఎనిమిది బైక్ లను సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పోలీస్ సిబ్బంది గమనించి పేకాట ఆడుతున్న నేరస్థలం నుంచి 5 మంది వ్యక్తులు పారిపోవడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఘనంగా ఇఫ్కో ఎంసి క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వార్షికోత్సవ వేడుకలు



**శిరివెళ్ల, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

మండలంలోని కోటపాడు గ్రామంలో ఇఫ్కో ఎంసి క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోటపాడు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అరుణ్, మధు మరియు మహమ్మద్ గౌస్ లు రైతులకి పురుగు మందులు వాడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఇఫ్కో ఎంసీ కంపెనీ యొక్క కిసాన్ సురక్ష బీమా యోజన గురించి ప్రజలకు తెలియజేశారు.

## నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయండి - యుటిఎఫ్




**ప్యాపిలి, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాల్సిన ప్రభుత్వం సిపియస్ విధానాన్ని రద్దు చేయకుండా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ అనే పేరుతో మరో కొత్త విధానాన్ని తీసుకురావడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తక్షణమే దేశమంతటా పాత పెన్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్ట్ 30వ తేదీ అనగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు యుటిఎఫ్ డోన్ డివిజన్ ఆధ్వర్యంలో డోన్ పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టడం జరుగుతున్నదని కావున ఎక్కువ సంఖ్యలో యుటిఎఫ్ కార్యకర్తలు ఉపాధ్యాయులు హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పాఠశాల సమయం అనంతరం మండల పరిధిలోని ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల శాఖ అధ్యక్షులు కృష్ణా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపియస్ విధానం రద్దు చేయాలని పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ చేయాలని వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ విధంగా యుపియస్ విధానాన్ని ముందుకు తీసుకొని రావడం తీవ్ర ఆక్షేపణీయం అని తెలిపారు.ఇంకా ఆయన మాట్లాడుతూ సిపియస్ విధానం కంటే మెరుగైన విధానం అంటూ కేంద్ర ప్రభుత్వం యుపియస్ విధానాన్ని తీసుకొని వచ్చి అంకెల గారడీ చేసిందని విమర్శించారు.ఉద్యోగుల ఉపాధ్యాయుల వాటాతో సంబంధం లేకుండా అన్ని రకాల సదుపాయాలు ఉండే పాత పెన్షన్ కంటే మరే విధానం అంగీకారం కాదని తేల్చి చెప్పారు.సీనియర్ నాయకులు బొజ్జన్న మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ నెలలో సిపియస్ స్థానములో జిపియస్ విధానాన్ని ముందుకు తీసుకొని వచ్చిందని దీన్ని యుటిఎఫ్ మరియు ఇతర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు.ప్రస్తుత ప్రభుత్వం కూడా జిపియస్ అమలుకు ముందుకు వస్తే యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించి నిరసన చేసిన ఫలితంగా తాత్కాలికంగా జిపియస్ చట్టాన్ని నిలుపుదల చేసిందని గుర్తు చేశారు.కార్పొరేట్ లకు,షేర్ మార్కెట్ మాయాజాలానికి ఉపయోగపడే సిపియస్,జిపియస్,యుపియస్ విధానాలను అమలు చేయడం ఆపి పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్,నాగ మద్దయ్య,సాలయ్య,నాగాంజనేయులు,లోకేశ్వరి,వాణి బాయి,సోనీ,మారతమ్మ,పాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం






**వనపర్తి, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు బైకు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు, స్థానికులువివరాలు.. కామరెడ్డి పల్లికి చెందిన అశోకు, బోయ చందు బైకుపై వనపర్తి కి వెళ్తుండగా,%ు ూ 07 జు ఖీ%4528, కామిరెడ్డిపల్లి స్టేజి దగ్గర వనపర్తి డిపోకు చెందిన ఆర్టిసి బస్సు%ూ 32 ు% 5577, ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించాలి

**ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి**
**మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలి**
**అధికారులు స్పందించే వరకు ఉద్యమాలు నిర్వహిస్తాం**
**ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్**




**దేవనకొండ, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

దేవనకొండ మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పునః ప్రారంభించాలని,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా నిత్యం కరువు,కాటకాలతో సతమతమవుతొందని అన్నారు.కరువు తో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందని అన్నారు.ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని,వెళ్లే సమయంలో వారి పిల్లల చదువులకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందని,మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రాయసాలతో వందలాది మంది విద్యార్థులు విద్యాను అభ్యసిస్తున్నారని,చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా, ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా డి.ఎన్.టి వసతి గృహం ఉండేదని,పక్కా గృహం లేదని, ఇతర కారణాలు చూపి,నిర్వహణ లోపంతో మూసివేయడం ఏంటని ? ఆగ్రహం వ్యక్తం చేశారు.వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు టీసి లు తీసుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని, దీంతో అడ్మిషన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా మండల కేంద్రంలోబాలికల వసతి గృహం లేకపోవడంతో కర్నూలు,ఆదోని తదితర ప్రాంతాలకు విద్యాను అభ్యసిస్తున్నారని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నపించిన, వాటిని గాలికొదిలేశారని ఆరోపించారు. దశల వారీ ఉద్యమాల్లో భాగంగా రాస్తారోకో నిర్వహిస్తున్నామని, అధికారులు తక్షణమే స్పందించి,మండల కేంద్రంలో మూసివేసిన బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించి,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేయాలని,లేనిపక్షంలో ఉద్యమాలు మరిన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు మధు,భాస్కర్,నాయకులు ఉమేష్,సురేంద్ర,అభి,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్యలపై ప్రజా ప్రతినిధులు స్పందించండి

**దేవనకొండ, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**



మండలంలో రైతాంగం ఎదుర్కొంటున్నటు వంటి సాగునీటి సమస్యలపై మండల ప్రజా ప్రతినిధులు స్పందించాలని పరిష్కారానికై ప్రయత్నం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీర శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం నాడు దేవనకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి వినతి పత్రాన్ని మండల ప్రజాప్రతినిధులకు అందజేశారు ఈ సందర్భంగా బి.వీరశేఖర్ మాట్లాడుతూ మండలంలో సాగునీటి ప్రధాన వనరు అయినటువంటి హంద్రీనీవా సమస్యలు 20 ఏళ్లుగా నానుతున్నాయని ప్రభుత్వాలు మారినా పట్టించుకోవడంలేదని వాపోయారు గతంలోని ఏలిన ప్రభుత్వాలు 20 ఏళ్లుగా హంద్రీనీవా పై నిర్లక్ష్యం వహించాయని పేర్కొన్నారు హంద్రీ నీవా ప్రధాన కాలువ పనులు కరివేముల తెర్నేకల్ మధ్యన మరియు కప్పట్రాల దగ్గరపెండింగ్లో ఉన్నాయని వాటిని పూర్తిచేసే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా 46 వేల ఎకరాలకు స్థిరీకరణ సాగునీరు ఇస్తామన్న ప్రభుత్వాలు ఆచరణలో పంటకాల్వాలు నిర్మాణం చేపట్టలేదని వెంటనే పంటకాల్వా లు నిర్మాణం కి ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరారు .అదేవిధంగా గుండ్లకొండ దగ్గర స్లుయిజ్ ఏర్పాటు చేస్తే చేయడం ద్వారా 10వేల ఎకరాల కు అదనంగా సాగునీరు, మండలంలోని చెరువులకు నీళ్లు మళ్లించే అవకాశం ఉందని ఈ అంశాలపై మండల ప్రజా ప్రతినిధులు రాజకీయాల కతీతంగా కృషి చేయాలని కోరారు మండల ప్రజానీకం ఎంతో గౌరవంతో ఆశతో మీ పట్ల అభిమానంతో మిమ్మల్ని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నారని ప్రజల ఆకాంక్షల కనుగణంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, ప్రజల రుణం తీర్చుకోవాలని వారి విజ్ఞప్తి చేశారు అనంతరం ఎంపీపీ ఎంపీడీవో ఇతర ప్రజాప్రతినిధులు అధికారులకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సూరి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మహబూబ్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ భాష ,సీనియర్ నాయకులు బజారి,కెపి రాముడు, ప్రజాసంఘాల నాయకులు సుధాకర్ ,కౌలుట్ల, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనాగేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ట మహొత్సవాలు

**చెన్నూరు, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**



చెన్నూరు బస్టాండ్ సమీపంలో ట్రంక్ రోడ్డు పక్కన వెలసిన పురాతన శ్రీ నాగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 27వ తేదీ మంగళవారం నుంచి 29వ తేదీ గురువారం వరకు ఆదిత్యది నవగ్రహ. ధ్వజ. శిఖర. కలిశ. ప్రతిష్ట మహొత్సవాలు ప్రారంభమయ్యాయి, ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ. గోపూజ. గణపతి పూజ. పుణ్యః వచనం. నవగ్రహ మంట పారాధన. కంకణ ధారణ. బుద్వికరణం. యాగశాల ప్రవేశం. మంగళ హారతి తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు వేద పండితుల చేతుల మీదుగా ప్రారంభించారు.28వ తేదీ బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రాతఃకాల పూజ. యంత్రాలకు మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం. గణపతి . నవగ్రహ. వాస్తు. పురుష. శ్రీ సుక్త హొమాలు. చండీ హొమం. మృత్యుంజయ హొమం. మంగళహారతి. తీర్థ ప్రసాద వినియోగం అందించారు, సాయంత్రం మహాస్నపనం. దీక్ష హొమం. ధాన్యాదివాసం. సయ్యాది వాసం. పుష్పాదివాసం. మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం ఏర్పాటు చేశారు కోడూరు కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం రెండు రోజులపాటు నవగ్రహ ధ్వజస్తంభ శిఖర కలశ హొమాలు పూజలు నిర్వహించారు, గురువారం ఉదయం 8:15 గంటలకు ప్రతిష్ట.9:45 గంటలకు ధ్వజ నవగ్రహ ప్రతిష్ట. ప్రాణ ప్రతిష్ట. కళ న్యాసం. నేత్రో నిమ్మలనం. పూర్ణాహుతి నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటలకు శివపార్వతుల కళ్యాణం మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్న సంతర్పణ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

## శ్రీలలితాంబిక నాగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్తత

**భారీగా మోహరించిన పోలీసులు**



**చెన్నూరు/కడప, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

చెన్నూరు పాత రోడ్డు వద్ద వెలసిన శ్రీ లలితాంబిక నాగేశ్వర స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట మహొత్సవ కార్యక్రమంలో భాగంగా, బుధవారం గ్రామంలో ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం ఆలయ కమిటీ నిర్వహించింది గ్రామోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాలను సమీప మసీదు వీధి గుండా ఆలయంలోకి తీసుకు వెళుతుండగా అక్కడ ఓ వర్గం వారు అడ్డగించుకుని మసీదు వీధి గూండా వెళ్లొద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఈ సమస్యపై ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది . దీంతో ఇరు వర్గాలకు చెందిన గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకుని వాగ్వివాదం చేస్తుండడంతో. పరిస్థితులను గమనించిన సీఐ పురుషోత్తమ రాజు ఇరు వర్గాలకు నచ్చ చెప్పడం జరిగింది, అలాగే ఈ సమస్యపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలియగానే కడప నుండి వచ్చిన ఏ ఎస్ పి వెంకట రాముడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చాక చక్యంగా వ్యవహరించడంతోపాటు సమస్యను సమర్థుబాటు చేయడం జరిగింది. అలాగే పోలీసు బలగాలను పంపించడం జరిగింది. అదేవిధంగా ఇరువర్గాలకు చెందిన పెద్దలను పిలిపించి ఉద్రిక్తలకు తావు లేకుండా ఉత్సవ విగ్రహాలను మరొ మార్గం గుండా పంపించడం జరిగింది. అయితే ఏ క్షణమైనా గ్రామంలో ఇరువర్గాల మధ్య సమస్య ఏర్పడవచ్చని ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరగవచ్చని పోలీసులు అప్రమత్తమై పాత రోడ్డు సమీపంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

## శేరుపల్లీ గ్రామంలో పలు వివాహాలకు హాజరైన శ్రీహరి రాజ్



**శ్రీరంగాపూర్/వనపర్తి, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని శేరుపల్లీ గ్రామంలో పలు వివాహాలకు హాజరైన నూతన వధువు వరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి చర్ల శ్రీహరి రాజు, ఇట్టి కార్యక్రమంలో శేరిపల్లి రవి, చీర్ల నాగరాజు, హేమంత్ సాగర్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్




**శ్రీరంగాపూర్/వనపర్తి, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

శ్రీకన్వెన్షన్ కొంపల్లి నందు అజయ్ కుమార్ వెడ్స్ సిరిల వివాహ వేడుకల్లో పాల్గొన్న వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల కోత్వల్, జాతీయ ఓబిసి సెల్ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జన్వాడలో మరోమారు అధికారుల సర్వే

**హైదరాబాద్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామంలోని ఫామ్‌హౌస్ వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా రెండోరోజూ సర్వే చేపట్టారు. ఆర్ఐ తేజ, మండల సర్వేయర్ సాయితేజ సహా ఇరిగేషన్ శాఖకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం.. నక్ష, డీజీపీఎస్ యంత్రాలతో సర్వే చేసింది. జన్వాడ ఫామ్‌హౌస్ పక్క నుంచి ఫిరంగి నాలా (బుల్కాపూర్ కత్వా) ప్రవహిస్తోంది. నాలాలో ఫామ్‌హౌస్ ప్రహరీగోడ, గేటు నిర్మించారని ఆరోపణలున్నాయి. జన్వాడ ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
గురువారం । ఆగస్టు । 29 । 2024


# దివ్యాంగులకు అండగా ఉంటా

### వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే
### ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నంద్యాల, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

దేశంలో ఎక్కడా లేనివిధంగా, ప్రభుత్వ ఉద్యోగులులా ప్రతి నెల 1వ తేదీననే ఇంటికి వచ్చి దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పెన్షన్ అందుస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని, దివ్యాంగులకు తాను అండగా ఉంటానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయం నుంచి కాన్వాయితో బయటకు వెళ్ళుతుండగా రెండు కళ్ళులేని దివ్యాంగుడు దళిత భీమన్న కుటుంబంతో ఎంపీ శబరికి దండం పెట్టాడు. వెంటనే ఎంపీ శబరి తన వాహనం దిగి రెండు కళ్ళులేని దివ్యాంగుడితో మీ సమస్య ఏమిటని అడిగి తెలుసుకున్నారు. నంద్యాల మండలం చాబోలు గ్రామం దళిత కాలనీకి చెందిన భీమన్న అను నాకు రెండు కళ్ళు పోయాయాని, కుటుంబం పోసించుకునేందుకు ఉద్యోగం లేదా ఉపాధి చూపించాలని ఎంపీ శబరికి విన్నవించారు. టీడీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీలాంటి వాళ్లకు అండగా ఉండేందుకు నెలకు ఆరువేల రూపాయలు పెన్షన్ అందిస్తున్నారని చెప్పారు. మీ సమస్య జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొనివెళ్లి పరిష్కారం చూపుతానని ఎంపీ బైరెడ్డి శబరి దివ్యాంగుడు భీమన్నకు హామీ ఇచ్చారు. ఎక్కువ మంది ఉన్నా బిజీ బిజీగా పోతున్నా తాము దండం పెట్టగానే కారు ఆపి దిగి తన కష్టం విని పరిష్కారం చూపుతానని చెప్పిన ఎంపీ శబరికి రెండు కళ్ళులేని భీమన్న ధన్యవాదములు చెప్పారు.



# వరంగల్‌లో గవర్నర్ పర్యటన















### ములుగు జిల్లాలో గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటన

**వరంగల్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. తొలుత ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించారు. రామప్ప, కోట గుళ్లను సందర్శించారు. లక్నవరం సరస్సును సందర్శించి, బోటు షికారులో తిరిగారు. అంతకుముందు మంత్రులు సీతక్క, పొంగులేటి నాయకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ ప్రసంగించారు. గవర్నర్ రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశారు. ఇకపోతే ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని త్వరలోనే దత్తత తీసు కుంటానని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా గోవిందరావుపేట మండలం బుస్సాపురం గ్రామంలోని పర్యాటక ప్రాంతమైన లక్నవరానికి చేరుకొని ఆయన బస చేశారు. బుధవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి సరస్సులో గవర్నర్ స్పీడ్ బోటు షికారు చేస్తూ లక్నవరం అందాలను తలకించారు. తాను ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గవర్నర్ వెల్లడించారు. అనంతరం సీతక్క మాట్లా డుతూ జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని గవర్నర్ హామీ ఇవ్వడం చాలా అభినందనీయమని అన్నారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్, పోలీసులు, ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుగు ప్రయాణంలో గవర్నర్ ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాను సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా విషపురుగు కాటుకు గురైన కానిస్టేబుల్‌ను పరా మర్శించారు. గవర్నర్ వెంట టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ డాక్టర్ పి. శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

## కస్తూర్బా పాఠశాలలో కంపచెట్లు తొలగింపు

**శ్రీరంగాపూర్/వనపర్తి, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**



శ్రీరంగాపూర్ మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాల ఎదురుగా ఉన్న కంప చెట్లు డ్రైనేజీ వాటర్ జెసిబి సహాయంతో మరమ్మత్తులు చేపించిన రెడ్డి చర్ల శ్రీహరి రాజ్ ఇట్టి కార్యక్రమంలో, ప్రిన్సిపాల్ వాణి, కేజీబీవీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## మాటల రాయుడు లేరన్న నిజం నమ్మలేకపోతున్నా

### చింతల సుబ్బరాయుడు కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి





**నంద్యాల, ఆగస్టు 28 (పీపుల్స్ మోటివేషన్) :**

మాటల రాయుడు (చింతల సుబ్బరాయుడు) లేరన్న నిజం నమ్మలేకపోతున్నానని, ఆయన లేనిలోటు టీడీపీకి, తనకు వ్యక్తిగతంగా చాలా నష్టమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల బాలాజీ కాంప్లెక్స్ లో ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు చింతల సుబ్బరాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, ఆయన కుటుంబాన్ని బైరెడ్డి శబరి పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ చింతల సుబ్బారాయుడు మృతి చాలా బాధేసిందని, ఎన్నికల ప్రచారంతో ముందు మాటల రాయుడు (చింతల సుబ్బారాయుడు) మాట్లాడిన తర్వాతే ఇతరులకు అవకాశం ఇచ్చేవారమణి, తను చెప్పదలచుకుంది, అనర్గలంగా, ముక్కుమూటిగా మాట్లాడే మనిషి చింతల సుబ్బారాయుడు అని ఆమె గుర్తు చేసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాబోతుందని, నంద్యాల ఎమ్మెల్యేగా తన స్నేహితులు %చీవీణ% ఫరూక్, నంద్యాల %వీూ% గా %ణతీ%. బైరెడ్డి శబరి గెలుస్తున్నారని ఎన్నికల ప్రచారంలో ముందుండి ప్రచారం చేసి అధికారం వచ్చిన తర్వాత ఆయన లేకపోవడం చాలా బాధేస్తోందని, ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని ఎంపీ బైరెడ్డి శబరి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు

### యుద్ధాల్లో మరణాల కంటే ఎక్కువగా ప్రమాద మృతులు
### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

**న్యూఢిల్లీ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

పెద్ద సంఖ్యలో రోడ్డు ప్రమాద మరణాలపై కేంద్రమంత్రి గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆయన.. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఫిక్కీ రోడ్ సేఫ్టీ అవార్డ్స్, కాంక్లేవ్ 2024లో పాల్గొన్న గడ్కరీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. మూడు లక్షల మంది గాయపడుతున్నారు. తద్వారా దేశ జీడీపీకి 3శాతం నష్టం వాటిల్లుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్‌లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలోని అన్ని హైవేలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే.. లైనులో వెళ్లే క్రమశిక్షణ పాటించాలన్నారు. అంబులెన్సులు, వాటి డ్రైవర్లకు ప్రత్యేక కోడ్‌లను ఇచ్చేందుకు తమ మంత్రిత్వశాఖ సిద్ధమవుతోందని అన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను రక్షించేందుకు వేగంగా స్పందించడంతోపాటు.. కట్టర్ల వంటి అధునాతన పనిముట్లను వాడకంలో వారికి శిక్షణ ఇస్తామన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు

**పదిరోజులపాటు ఉత్సవాల నిర్వహణ**
**3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు**

విజయవాడ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఈయేడు ఘనంగా నిర్వహించాలని పాలక మండలి నిర్ణయించింది. పది రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే వేడుకల్లో అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముహూర్తం ఖరారు చేశారు. మొదటిరోజైన అక్టోబర్ 3వ తేదీన అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 4వ తేదీన గాయత్రీదేవిగా, 5వ తేదీన అన్నపూర్ణ దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. 6వ తేదీన లలితా త్రిపుర సుందరీదేవిగా, 7వ తేదీన మహాచండీ అలంకారంలో, 8వ తేదీన మహాలక్ష్మీ దేవి గా దర్శనమిస్తారు. 9వ తేదీన సరస్వతి దేవిగా దర్శనమిస్తారు. 10వ తేదీన దుర్గాదేవిగా, 11వ తేదీన న మహిషాసురమర్దినిగా, 12వ తేదీన రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు దర్శన మిస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దసరా ఉత్సవాల కోసం ఆలయంలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో రామారావు తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగే దేవీ శరన్నవరాత్రులకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి రానున్నారు. సగటున ప్రతి రోజు లక్షమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం రోజు సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారు. అక్టోబర్ 9వ తేదీన సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణ కోసం ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. క్యూ లైన్ల ఏర్పాటుతో పాటు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో 10 రోజుల పాటు ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తారు. గర్భగుడి దర్శనానికి అనుమతించరు. కేవలం ప్రోట్రోకాల్ కలిగిన వ్యక్తులకు మాత్రమే ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. సామాన్య భక్తులకు లిఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉండదు. కేవలం వృద్ధులు, ఆలయ సిబ్బందికి లిఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. కొండకింద నుంచి పైకి క్యూలైన్‌లో వెళ్లాల్సి ఉంటుంది. బస్సు మార్గంలో కొండపైకి సగం వరకు చేరుకోవచ్చు. అక్కడి నుంచి నడక ద్వారా క్యూలైన్‌లోకి ప్రవేశించాలి. వీఐపీ వాహనాలను సైతం కొంతవరకు అనుమతిస్తారు. ప్రసాదం కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను చేయనున్నారు.

## ఇస్లామిక్ టెర్రరిస్టుల హెచరికల నేపథ్యం

**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు భద్రత పెంపు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

ఉగ్రవాదుల దుశ్చర్యలు, బెదరింపుల నేపథ్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ భద్రతను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మరింత పటిష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న జడ్ ప్లస్ కేటగిరి భద్రతను అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ కు పెంచింది. దీంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమానమైన భద్రత మోహన్ భగవత్‌కు లభిస్తుంది. భద్రతకు ముప్పు తలెత్తే అవకాశాలపై ఇంటెలిజెన్స్ బ్యూరో ఇచ్చిన తాజా నివేదక ప్రకారం మోహన్ భగవత్‌కు భద్రత పెంచాలని ఆగస్టు 16న తాజా ఆదేశాలు జారీ అయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. గతంలో మోహన్ భగవత్ కొన్ని సెన్సిటివ్ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఏఎస్ఎల్ ప్రోటోకాల్ కల్పించేవారు. ఇటీవల కొన్ని చోట్ల, ముఖ్యంగా బీజేపీయేతర రాష్ట్రాల్లో భగవత్ భద్రతలో అలసత్వాన్ని ఇంటిలిజెన్స్ గమనించింది. రాడికల్ ఇస్లామిస్ట్ గ్రూపులతో సహా వివిధ సంస్థల నుంచి ఆయనకు ముప్పు పెరిగినట్టు అంచనా వేసింది. ఈ నేపథ్యంలో భగవత్‌కు ఏఎస్ఎస్ ప్రోటోకాల్ భద్రత కల్పించాలని హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఏఎస్ఎల్ భద్రత ప్రకారం జిల్లా యంత్రాంగం, పోలీలు, ఆరోగ్యం, ఇతర శాఖలు వంటి స్థానిక సంస్థలు సమష్టిగా భద్రత కల్పించాల్సి ఉంటుంది. భగవత్ ఏదైనా కార్యక్రమానికి వెళ్లాల్సి ఉంటే ముందుగానే ఒక బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే అక్కడికి వెళ్లేందుకు అనుమతిస్తారు.

## తొలిసారి సిఎంగా పదవి చేపట్టి 30 ఏళ్లు

**చంద్రబాబును అభినందించిన మంత్రులు**

**అమరావతి,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ జీవితంపై బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో పలువురు మంత్రుల ప్రస్తావించారు. సీఎంగా చంద్రబాబు తొలిసారి బాధ్యతలు స్వీకరించి సెప్టెంబర్ 1 నాటికి 30 సంవత్సారాలు పూర్తవనున్నాయి. ఈ సందర్భాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రులు ప్రతిపాదించారు. ముఖ్యమంత్రికి మంత్రులు ముందస్తు శుభాకాంక్షులు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీకి చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించి 30 ఏళ్లు పూర్తవుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాజకీయ జీవితంలో కీలక ఘట్టం వేళ సీఎం చంద్రబాబుకు కేబినెట్ అభినందనలు తెలిపింది. తొలిసారి సీఎం అయినప్పుడు చంద్రబాబు ప్రవేశపెట్టిన శ్రమదానం, జన్మభూమి, ఆకస్మిక తనిఖీలు వంటి అంశాలను ఈ సందర్భంగా పలువురు మంత్రులు గుర్తుచేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలు పేదలకు చేరువైన విధానంపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్ల నిధులు మంజూరుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఇది చంద్రబాబు ఘనత అని ఆమె వ్యాఖ్యానించారు. అమరావతి, పోలవరం నిర్మాణాలు పూర్తి చేసి ఏపీని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. నిధుల కోసం చంద్రబాబు ఢిల్లీ వెళితే... కేసుల మాఫీ కోసం జగన్ ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు కొట్టాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులిచ్చిన ప్రధాని మోదీకి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# వైసిపికి మరో భారీ షాక్

**టిడిపిలో చేరనున్న మోపిదేవి**
**రాజ్యసభకు రాజీనామాకు సైతం సిద్ధం**
**చంద్రబాబుతో ఇప్పటికే మంతనాలు**
**మోపిదేవి బాటలోనే మరో రాజ్యసభ ఎంపి**

**అమరావతి,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

లోక్‌సభ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి చవి చూసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలువురు నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. మొన్నటికి మొన్న ఏలూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ నూర్జహాన్ దంపతులు పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. తాజాగా మోపిదేవి వెంకట రమణ.. తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన బాటలోనే ఆ పార్టీకి చెందిన మరో రాజ్యసభ సభ్యుడు సైతం తన పదవిని అర్థాంతరంగా వదులుకునేందుకు సిద్ధమయ్యారని సమాచారం. పారిశ్రామిక వేత్తగా ఉన్న ఆ ఎంపీ సైతం తన సభ్యత్వానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. గత ఆదివారం హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడితో వైసీపీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణతోపాటు ఆ పారిశ్రామికవేత్త భేటీ అయినట్లు సమాచారం. వైసీపీ రాజ్యసభ సభ్యులు టీడీపీలో చేరడానికి చంద్రబాబు కేబినెట్‌లోని ఓ మంత్రి కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. వైసిపి అగ్రనాయకత్వంతో సరిపడకనే తాను పార్టీ మారుతున్నట్టు మోపిదేవి వెంకట రమణ స్పష్టం చేశారు. అలాగే పార్టీలో తాజాగా నెలకొన్న పరిణామాలపై ఆయన తీవ్ర అసంతృప్తి తో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం రాజ్యసభ పదవికి మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేయనున్నారు. అందుకు సంబంధించిన లేఖను ఢిల్లీలో రాజ్యసభ చైర్మన్‌కు ఆయన స్వయంగా అందజేయనున్నారు. అనంతరం వైసీపీకి ఆయన రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పారిశ్రామికవేత్త అయిన రాజ్యసభ సభ్యుడు సైతం మోపిదేవితోపాటు రాజీనామా లేఖను సభ చైర్మన్‌కు అందజేయనున్నారని తెలుస్తుంది. పార్టీలోని కీలక నేతలు అనుకున్నవారంతా ఇలా ఒకొక్కరుగా పార్టీ వీడడం పార్టీతోపాటు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్‌కు సైతం బిగ్ షాక్ అనే ఓ చర్చ పార్టీ శ్రేణుల్లో అంతర్గతంగా సాగుతున్నట్లు తెలుస్తుంది. మోపిదేవి త్వరలోనే శ్రేణులతో సమావేశమై రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. బాపట్ల జిల్లాకు కీలక నేతగా ఉంటూ వస్తున్న మోపిదేవి వెంకటరమణ ఇప్పుడు రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. అనుచరలతో సమావేశం అనంతరం, చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇచ్చిన తేదీని మీడియాకు చెప్పనున్నారు. అక్రమాస్తుల కేసులో జగన్‌తోపాటు జైలుకు వెళ్లి వచ్చిన మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేయడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాలను షేక్ చేస్తోంది. వైసీపీ పేరుకో బీసీల పార్టీ అంటు జపం చేస్తోందని కానీ అక్కడ ఆ పరిస్థితి లేదని మోపిదేవి అంటున్నారు. మరోవైపు టీడీపీలోకి వచ్చేస్తే ఎలాంటి ప్రయార్టీ ఉంటుందనే డిస్కషన్ కూడా జరిగినట్టు చెబుతున్నారు. మంత్రివర్గంలో చోటు ఇవ్వాలని మోపిదేవి అడిగితే... ఒకే జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఇబ్బంది అవుతుందని చెప్పినట్టు తెలుస్తోంది. ఇప్పటికే అనగాని సత్యప్రసాద్ మంత్రిగా ఉన్నారు. ఇప్పుడు అదే జిల్లా నుంచి మోపిదేవికి మంత్రి పదవి ఇవ్వడం కుదరదని చెప్పిసినట్టు సమాచారం. అయితే రాజ్యసభను రెన్యువల్ చేసేందుకు మాత్రం అంగీకరించిందనే టాక్ నడుస్తోంది. కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగిన మోపిదేవి వెంకటరమణ జగన్‌తోపాటు జైలుకు వెళ్లి వచ్చారు. అనంతరం వైసీపీలో చేరి అక్కడ కూడా తన పట్టు నిలుపుకున్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికై మంత్రిగా కూడా పని చేశారు. తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో ఆయనను పార్టీ రాజ్యసభకు పంపించింది.

# వైసిపికి వరుస షాక్‌లు

**పార్టీని వీడుతున్న మరో నేతల**
**మోపిదేవి బాటలో ఎమ్మెల్సీ పోతుల సునీత**



**అమరావతి,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీకి గత రెండు రోజులుగా షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. కీలక నేతలు పార్టీని వీడుతున్నట్లు ప్రకటిస్తున్నారు. ఏళ్లుగా ఆ పార్టీని అంటిపెట్టుకున్న నేతలు సైతం ఇప్పుడు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు ముఖ్య నేతలు పార్టీ వీడగా.. మరికొందరు పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణ ఊహించని రీతిలో తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో పాటు.. పార్టీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఘటన ఇలా ఉండగానే.. మరో కీలక పరిణామం వైసీపీని భారీగా కుదిపేసింది. వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత సంచలన ప్రకటన చేశారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు.. ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్‌కు సునీత ఓ లేఖ రాశారు. గతంలో టీడీపీలోంచి వైసీపీలో చేరిన సునీత.. ఇప్పుడు వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఏపీలో వైసీపీకి భవిష్యత్ లేదనే నిర్ణయానికి వచ్చే ఆ పార్టీ నేతలు ఇలా వరుసగా పార్టీని వీడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన పోతుల సునీత.. ఏ పార్టీలో చేరబోతున్నారనే అంశం ఆసక్తికరంగా మారింది. గతంలో టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన సునీత.. మళ్లీ సొంత గూటికి వెళ్తారా? లేక వేరే పార్టీలో జాయిన్ అవుతారా? అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, సునీత అనుచరుల్లో జరుగుతున్న చర్చ ప్రకారం చూసుకుంటే.. ఆమె త్వరలోనే బీజేపీలో చేరుతారని తెలుస్తోంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండడం, రాష్ట్ర ప్రభుత్వంలోనూ బీజేపీ భాగస్వామ్యం కావడంతో ప్రయోజనం ఉంటుందని ఆమె భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ కారణంగా ఆమె బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే చాలా మంది ముఖ్య నేతలు వైసీపీని వీడగా.. మరికొందరు అదే ఆలోచనలో ఉన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి వంటి వారు బాహాటంగానే తాము పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నామని ప్రకటించారు. ఇలా ఎందరో నేతలు ఎన్నికల తరువాత వైసీపీకి దూరంగా ఉంటున్నారు.

## డిఎంకె ఎంపి జగద్రక్షకన్‌కు ఇడి షాక్

**ఫెమా ఉల్లంఘనలతో రూ.908 కోట్ల జరిమానా**

**న్యూఢిల్లీ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు ఎస్.జగద్రక్షకన్ కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజిమెంట్ యాక్ట్ కేసులో ఆయనకు, ఆయన కుటుంబానికి రూ.908 కోట్ల జరిమానా విధించింది. ఫెమా చట్టంలోని సెక్షన్ 37ఏ కింద 2020 సెప్టెంబర్‌లో సీజ్ చేసిన రూ.89.19 కోట్ల మొత్తాన్ని కూడా జప్తు చేసినట్టు తెలిపింది. ఆగస్టు 26న వెల్లడించిన తీర్పు ప్రకారం ఈ జరిమానా విధించినట్టు ఈడీ తెలిపింది. జగద్రక్షకన్ (76) డీఎంకే టిక్కెట్‌పై అరక్కోణం నుంచి లోక్‌సభకు పోటీ చేసి గెలిచారు. చెన్నై బేస్ట్ అకార్డ్ గ్రూప్‌కు వ్యవస్థాపకుడుగా ఉన్నారు. ఆయనకు సొంతంగా భరత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఉంది. జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులపై సంబంధిత కంపెనీపై ఫెమా ఉల్లంఘన కింద 2021 డిసెంబర్ 1న ఈడీ కేసు నమోదు చేసింది. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి 2017లో సింగపూర్‌లోని ఒక షెల్ కంపెనీలో రూ.42 కోట్లు వారు పెట్టుబడి పెట్టినట్టు ఈడీ విచారణలో తేలింది.

## ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ హత్యాచార ఘటన

**మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ సస్పెన్షన్**

**కోల్‌కతా,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం,హత్య కేసులో ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సస్పెండ్ చేసింది. డాక్టర్ ఘోష్ తన ప్రవర్తన వల్ల డాక్టర్ వృత్తికి చెడ్డపేరు తెచ్చారని క్రమశిక్షణా కమిటీ అతన్ని జాతీయ వైద్య సంఘం సభ్యత్వం నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని నిర్ణయించిందని ఐఎంఏ తెలపింది. అంతేగాకుండా బాధితురాలి తల్లిదండ్రులకు మనోవేదన గురయ్యేలా చేశారని వెల్లడించింది. ఈ కేసులో డాక్టర్ సందీప్ ఘోష్ ను సీబీఐ ఇప్పటికే విచారించింది. ట్రైనీ డాక్టర్ హత్యను డాక్టర్ సందీప్ ఘోష్ ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు బాధితురాలి తల్లిదండ్రులకు చెప్పాడు. అంతేగాకుండా తల్లిదద్రులను ఆమె మృతదేహాన్ని చూడటానికి అనుమతించేందుకు 3 గంటల పాటు వేచి చూసేలా చేశాడు. దీనిపై పెద్ద ఎత్తును ఆందోళనలు వ్యక్తం అయ్యాయి.

## రాంనగర్ నాలా ఆక్రమణలు పరిశీలించిన రంగనాథ్

**హైదరాబాద్,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్):**

ముషీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆకస్మికంగా పర్యటించారు. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీలో నాలాపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదుమేరకు అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మణెమ్మ గల్లీలో రోడ్డు ఇరుకుగా మారిందని, నాలా.. రోడ్డును ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇళ్లలోకి వరదనీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు మొరపెట్టుకున్నారు. నాలా ఆక్రమణ, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు, సబంధిత స్థల పత్రాలను పరిశీలించాలని జీహెచ్ఎంసీ, టౌన్ ఎ÷-లానింగ్, రెవెన్యూ అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

## జెఎంఎంకు చంపై సోరెన్ రాజీనామా

రాంచీ,ఆగస్ట్28(పీపుల్స్ మోటివేషన్): ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపాయీ సోరెన్ జేఎంఎంకు రాజీనామా చేశారు. ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీలో అన్ని పదవులకు రాజీనామా చేసినట్లు లేఖ విడుదల చేశారు. ఆదివాసులు, దళితులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. మరోవైపు తాను భాజపాలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చంపాయీ సోరెన్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.జేఎంఎం నేత హేమంత్ సోరెన్ జైలు నుంచి విడుదలైన తర్వాత ఝార్ఖండ్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి చంపాయీ వైదొలగడంతో.. హేమంత్ సోరెన్ మళ్లీ సీఎంగా పగ్గాలు చేపట్టారు. ఈ క్రమంలో సొంత పార్టీ అధినాయకత్వంపై చంపాయీ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో తాను ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ క్రమంలోనే భాజపా అగ్రనాయకత్వంతో భేటీ కావడంతో.. మాజీ సీఎం కాషాయ పార్టీలో చేరుతున్నారనే ప్రచారం జరిగింది. దీనిపై తాజాగా క్లారిటీ ఇచ్చిన ఆయన భాజపాలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation




# హిందీపరిశ్రమలో టాలెంట్‌కు స్థానం లేదు

**అలాంటి వారిని తీసి పక్కన పెడతారు**
**నటి కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు**

హిందీ చిత్ర పరిశ్రమలో టాలెంట్‌ను ఎంకరేజ్ చేయరని అంటూ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. టాలెంట్ ఉన్నవారికి ఇక్కడ ఎలాంటి గుర్తింపు లభించదని ఆరోపించారు. ప్రోత్సహించే వారు కూడా ఉండరన్నారు. నా దృష్టిలో బాలీవుడ్ ఒక నిస్సహాయ ప్రదేశం. ఈ పరిశ్రమకు చెందిన కొంతమంది ప్రముఖ వ్యక్తులు మనకు ఎలాంటి సాయం చేయరు. టాలెంట్‌ని చూసి వారు అసూయ పడతారు. ఎవరైనా టాలెంట్ ఉన్న వ్యక్తులు తమ దృష్టిలో పడితే తప్పకుండా వారి కెరీర్ నాశనం చేయడానికి చూస్తారు. పీఆర్‌లను నియమించి వారిపై దారుణంగా అవాస్తవాలు ప్రచారం చేయిస్తారు. ఇండస్ట్రీ వారిని బహిష్కరించేలా పరిస్థితులు సృష్టిస్తారు' అని కంగనా రనౌత్ ఆరోపించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. తాను అదే విధమైన పరిస్థితులు ఎదుర్కొన్నానని చెప్పారు. తనను బహిష్కరించారని పేర్కొన్నారు. 'నా వరకూ నేను మంచి వ్యక్తిని. నా చుట్టూ ఉన్న వారితో మర్యాద పూర్వకంగా నడుచుకుంటా. ఎన్నికల్లోనూ విజయం సాధించా. ఇండస్ట్రీ నుంచి ఎంతో ప్రేమాభిమానం పొందా. దీనిని బట్టి చూస్తే నాతో కొంతమందికి మాత్రమే సమస్య ఉంది. ఆ సమస్య నాలో ఉందా? లేదా వారిలో ఉందా? అనేది వారు కూడా ఒక్కసారి ఆలోచిస్తే మంచిది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' ఆమె స్వీయ దర్శకత్వంలో తెరకెక్కింది. సెప్టెంబర్ 6న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తన కెరీర్, బాలీవుడ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తనపై కుట్ర జరిగిందని చెప్పారు. తన సినిమాల్లో యాక్ట్ చేయొద్దని చాలా మందికి చెప్పారని ఆరోపించారు.

## ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్

**ప్రభాస్‌పై విక్రమ్ ప్రశంసల వర్షం**





ప్రపంచస్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్న స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం వరుస విజయాలను అందుకుంటూ రికార్డులు సొంతం చేసుకుంటున్నారు. తాజాగా ప్రభాస్ గురించి కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.'ప్రభాస్ ఇప్పుడు ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్. అతడిని తెలుగు హీరో అనడం సరికాదు' అని విక్రమ్ అన్నారు. మాళవిక మాట్లాడుతూ.. ప్రభాస్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. భాషపరంగా సినిమా సరిహద్దులను తొలగించారని ప్రశంసించారు. ఆయన నటించిన సినిమాలపై ప్రేక్షకులు చూపే అభిమానం చూస్తే ఆశ్చర్యమేస్తుందని చెప్పారు. ఈ ఏడాది 'కల్కి 2898 ఏడీ'తో భారీ విజయాన్ని అందుకున్న ప్రభాస్.. ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'రాజాసాబ్'. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీని షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత క్లారిటీ ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర చిత్రీకరణ పూర్తయింది. సినిమా షూటింగ్ కూడా కంప్లీటైంది' అని ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కెఎన్) రిప్లై ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర పూర్తయితే సినిమా షూటింగ్ అంతా కంప్లీట్ అయినట్లు కాదు కదా!' అని పేర్కొన్నారు. ప్రస్తుతం దీని చిత్రీకరణ శరవేగంగా జరుగుతోందన్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు.

## నిజాలు బయటపెట్టినందుకు వేధింపులు


**మళయాల నటి మిను వెల్లడి**

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదికలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. ఇప్పటి వరకు లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి 17 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. గతంలో ఎదురైన చేదు అనుభవాన్ని బయటపెట్టినందుకు తనకు సోషల్ మీడియా వేదికగా బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఓ నటి తెలిపారు. ప్రముఖ నటుడు జయసూర్యతోపాటు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు వల్ల తాను ఇబ్బందులు ఎదుర్కొన్నానంటూ నటి మిను మునీర్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయం బయపెట్టిన దగ్గరి నుంచి తనకు బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఆమె తెలిపారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ విషయం మరో చర్చనీయాంశంగా మారింది. 2013లో ఒక ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నప్పుడు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్యలు అసభ్య పదజాలంతో తనను దూషించినట్లు మిను ఇటీవల ఆరోపించారు. అన్నింటినీ తట్టుకొని సినిమా కోసం వర్క్ చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ వారి వేధింపులు మితిమీరాయని వాపోయారు. ఈ సంఘటన వల్ల తాను మానసికంగా ఎంతో కుంగిపోయానన్నారు. మరోవైపు అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అధ్యక్ష పదవికి ప్రముఖ నటుడు మోహన్‌లాల్ రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులున్న మొత్తం పాలక మండలి పదవుల నుంచి వైదొలిగింది. ఈ మేరకు 'అమ్మ ' సంఘం మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కమిటీలోని కొంతమంది సభ్యులపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దీంతో నైతిక బాధ్యతగా వీరంతా రాజీనామా చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## స్పెషల్ సాంగ్‌లో శ్రియా శరణ్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ స్టార్ కాంపౌండ్ నుంచి ఇప్పటికే కంగువ విడుదలకు ముస్తాబుతోంది. ఈ సినిమా విడుదల కాకముందే సూర్య 44 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు సూర్య. స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. తొలి షెడ్యూల్‌లో భాగంగా అండమాన్ లోని పోర్ట్ ÷-లబెయిర్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు సూర్య, పూజాహెగ్డేపై వచ్చే సాంగ్స్‌ను చిత్రీకరించి నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సీనియర్ హీరోయిన్ శ్రియా శరణ్ స్పెషల్ సాంగ్‌లో మెరువనుంది. ఊటీ షెడ్యూల్‌లో ఈ పాటను చిత్రీకరించనున్నారట మేకర్స్. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఇడుక్కి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి సంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో వస్తోన్న సూర్య 44కు తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్ డీవోపీగా పనిచేస్తున్నాడు. సూర్య హోంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 2025 పొంగళ్ కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.



Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com